శంకుస్థాపనతో సరి

- బంజారా కమ్యూనిటీ భవనానికి 2014లో సీఎం చంద్రబాబు భూమిపూజ
- ఆ తర్వాత పట్టించుకోని వైనం
- ఫంక్షన్‌హాల్ లేక ఇబ్బందులు పడుతున్న బంజారాలు


బంజారా కమ్యూనిటీ భవనానికి కేటాయించిన స్థలం

కదిరి అర్బన్: సీఎం చంద్రబాబు చెప్పే మాటలకు ఆచరణకు సంబంధం ఉండదు. ఆర్భాటంగా ప్రకటనలు, శంకుస్థాపనలు చేయడం తర్వాత వాటి గురించి పట్టించుకోకపోవడం ఆయనకు అలవాటే. ఇందుకు నిదర్శనమే కదిరిలో బంజారా కమ్యూనిటీ భవనం. 2014లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కదిరి–హిందూపురం రహదారి పక్కన బంజారా కమ్యూనిటీ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే తర్వాత దాని నిర్మాణం గురించి మరచిపోయారు. దీంతో బంజారాలు శుభాకార్యాలు చేసుకునేందుకు నానాఅవస్థలు పడాల్సి వస్తోంది.

భారీ సంఖ్యలో బంజారాలు..

కదిరి డివిజన్ పరిధిలోని 10 మండలాల్లో మొత్తం 85 తండాలు ఉన్నాయి. వీటిలో సుమారు 30 వేల జనాభా ఉన్నారు. వీరు పెళ్లిళ్లు, శుభకార్యాలు, కమ్యూనిటికీ సంబంధించిన కార్యక్రమాలు చేసుకోవాలంటే రూ.లక్షలు చెల్లించి ప్రయివేట్ ఫంక్షన్‌హాళ్లకు వెళ్లాలి. ఆర్థికంగా అంతంత మాత్రంగానే ఉన్న బంజరాలు కార్యక్రమాల నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

స్థలం కేటాయించకుండానే..

బంజారాలు 2013లో తమకు కమ్యూనిటీ భవనం కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. అయితే అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. తర్వాత 2014లో స్థలం కేటాయించకుండానే సీఎం చంద్రబాబు ఏకంగా కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపనకు చేశారు. అయితే కనీసం భవన నిర్మాణం కాదు కదా సదరు స్థలాన్ని కూడా చదును చేయలేదు. ఆ తర్వాత బంజారాలు చందాలు వేసుకుని కదిరి హిందూపురం రహదారి పక్కన 1753–4 సర్వే నంబర్‌లో అప్పటి మార్కెట్ వ్యాల్యూ ఎకరం రూ.18,80,000 ఉండగా 44 సెంట్లకుగాను రూ.8,27,200 చెల్లించి స్థలాన్ని కొనుగోలు చేశారు. ఇచ్చిన స్థలంలో గుట్ట ఉండడంతో ఆ గుట్టను చదును చేయడానికి రూ.20 లక్షల దాకా బంజారాలే ఖర్చు పెట్టుకున్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి సత్వరం పూర్తి చేయాలని బంజారాలు కోరుతున్నారు.

నిధులు విడుదల చేయాలి



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బంజారా కమ్యూనిటీ భవనానికి శంకుస్థాన చేసి 11 ఏళ్లు అవుతోంది. ఇంతవరకు భవన నిర్మాణం జరగలేదు. ఈ ప్రాంతంలో బంజారాలంతా నిరుపేదలు. రెక్కాడితేకానీ డొక్కాడని జీవితాలు. శుభకార్యాలు చేసుకోవాలంటే ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. అలాగే సూదూర ప్రాంతాల నుంచి కదిరి వచ్చే బంజారాలు కదిరిలో బస చేసేందుకు కమ్యూనిటీ భవనం ఎంతగానో తోడ్పతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేసి భవన నిర్మాణం పూర్తి చేయాలి.

– కృష్ణానాయక్, బంజారా సంక్షేమ సేవా సంఘం కదిరి డివిజన్ అధ్యక్షుడు

క్లుప్తంగా

తవళం ఎద్దుల పరుష ప్రారంభం


ఎద్దులకు పూజ చేస్తున్న దృశ్యం

తనకల్లు: తవళం ఆంజనేయస్వామి ఎద్దుల పరుష సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈసందర్భంగా ఎద్దుల పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో ఆంజనేయ స్వామిని ప్రత్యేకంగా అలకరించి పూజలు చేపట్టారు. ఈసందర్భంగా ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ గంగసాని ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 29న ఎద్దుల రాతిదూలం లాగుడు పోటీలను నిర్వహిస్తామని, విజేతలకు నగదు బహుమతులను అందిస్తామన్నారు. 30న రాత్రి స్వామిని సూర్యప్రభ వాహనంపై ఊరేగిస్తామన్నారు. హరికథ, మే 1న రాత్రి చంద్రప్రభ వాహనం ఊరేగింపుతో పాటు ప్రత్యేకంగా ఆర్కెస్ట్రా ఉంటుందన్నారు. 2వ తేదీన రథోత్సవం నిర్వహిస్తామన్నారు. కాగా ఎద్దుల పరుషకు చుట్టుపక్కల మండలాలతో పాటు అన్నమయ్య జిల్లా, కర్ణాటకలోని చేలూరు, చాకివేలు, చింతామణి తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు, రైతులు తరలిరానున్నారు.

బాల్య వివాహాలను అరికడదాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: సమష్టి కృషితో బాల్య వివాహాలను అరికడదామని రెడ్స్ సంస్థ అధినేత భానుజా పేర్కొన్నారు. సోమవారం కదిరి ఆర్ అండ్‌బీ కార్యాలయంలో ముస్లిం మతపెద్దలు, పురోహితులతో కలిసి బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమానికి సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనలో అన్ని మతాలకు సంబంధించిన మతపెద్దలు, పురోహితుల పాత్ర కీలకమన్నారు. అబ్బాయికి 21, అమ్మాయికి 18 ఏళ్లు నిండిన తర్వాత వివాహం చేయాలన్నారు. తద్వారా వారి ఆరోగ్యాలు, జీవితాలు బాగుంటాయన్నారు. బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో రెడ్స్ సంస్థ ప్రతినిధులు యల్లప్ప, రవీంద్ర, మెహతాజ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని ఆపండి

కనగానపల్లి: మండల పరిధిలోని గుంతపల్లి గ్రామంలో ప్రధాన వీధిలో రహదారి పక్కన అక్రమంగా నిర్మిస్తున్న మరుగుదొడ్డిని ఆపాలని స్థానికులు కోరారు. ఈమేరకు సోమవారం బయపరెడ్డి, చెన్నారెడ్డితో పాటు పలువురు గ్రామస్తులు జిల్లా కేంద్రం పుట్టపర్తిలో జరిగిన ×ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త నరసింహులు వారి ఇంటి పక్కన ప్రధాన రహదారిలో వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకుంటున్నాడని దీనివల్ల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతాయన్నారు. ఇదే విషయమైన వారం రోజుల క్రితం అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కలెక్టర్‌కు విన్నవించారు. దీనిపై ఎంపీడీఓ అనిల్‌కుమార్‌ను వివరణ కోరగా... గ్రామస్తులు ఫిర్యాదు మేరకు నాలుగు రోజుల క్రితం గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టామన్నారు. రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి నిర్మాణం తొలగించాలని నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు.

అంగన్‌వాడీ చిన్నారులకు ఆటల పోటీలు


పిల్లలకు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: మే డే పురస్కరించుకొని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం కుటాగుళ్ల అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు జగన్మోహన్, బాబ్జాన్, రామ్మోహన్, అంగన్వాడి వర్కర్లు సుజాత, ఇందిరమ్మ, రామలక్ష్మి, శాంతి కుమారి, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించండి

ఓడీచెరువు: ఇనగలూరులోని అంబేడ్కర్ కాలనీకి కేటాయించిన శ్మశాన వాటిక స్థలానికి ప్రహరీ నిర్మించాలని కాలనీవాసులు కోరారు. ఈమేరకు సోమవారం ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించడంతోపాటు నీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఇనగలూరు గ్రామస్తులు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సేవలు కొనసాగించేలా చూడండి


ఆర్డీఓ మహేష్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయు నాయకులు

ధర్మవరం: ఆర్డీసీ సంస్థ సేవలు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఆర్డీఓ మహేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ జేవి రమణ, కోకన్వీనర్లు అయుబ్‌ఖాన్, ఎల్.ఆదినారాయణ మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ కరువు ప్రాంతమైన రాయలసీమలో విద్య, వైద్య, సామాజిక రంగాల్లో ఎనలేని సేవలు అందిస్తోందన్నారు. ఇలాంటి సంస్థకు కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్ఏ అనుమతులు నిలిపివేయడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి ఎఫ్‌సీఆర్ఏకి అనుమతులు కొనసాగించాలని విన్నవించారు. యూనియన్ల నేతలు నాగవేణి, లక్ష్మిదేవి, వరలక్ష్మి, సన్నప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సేవలు యథావిధిగా కొనసాగించి పేదలకు న్యాయం చేయాలని పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర తెలిపారు. పట్టణంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేయాలని కోరారు. పీఎస్‌యూ నాయకులు గణేష్, మహేంద్ర, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలను అణచివేయాలని చూస్తే ఉద్యమిస్తాం


పూలే విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నేతలు

ధర్మవరం అర్బన్: బీసీలను అణచివేయాలని చూస్తే ఉద్యమిస్తామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నామాల శంకరయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పట్టణంలోని కాలేజి సర్కిల్‌లో సోమవారం మహాత్మా జ్యోతిరామ్‌పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరుతూ శాంతియుతంగా ర్యాలీ చేస్తున్న ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్‌రావును పోలీసులు అరెస్టు చేయడం దారుణమన్నారు. ఓబీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని, ఓబీసీ మహిళలకు సబ్ కోటా ఇస్తూ మహిళా రిజర్వేషన్ చట్టాన్ని సవరించాలని దశాబ్దాలుగా కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అరెస్టులతో బీసీలను అణచివేయాలని చూస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జయశ్రీ, బీసీ సంక్షేమ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.వెంకటరమణ, నాయకులు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ ప్రారంభం


ధర్మవరంలో వేసవి శిక్షణను ప్రారంభిస్తున్న గ్రంథాలయాధికారిణి అంజలి సౌభాగ్యవతి

ధర్మవరం: పట్టణంలోని జగజ్జీవన్‌రాంనగర్‌లోనున్న ప్రధాన గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయాధికారిణి అంజలి సౌభాగ్యవతి వేసవి శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజూ కథలు చెప్పడం, పుసక్త పఠనం, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పెయింటింగ్, డ్యాన్స్, క్విజ్, జీకే, చెస్, క్యారమ్స్ తదితర వాటిలో చిన్నారులకు శిక్షణ ఇస్తామన్నారు. ఉపాధ్యాయుడు ముత్యాలప్ప, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బత్తలపల్లి: స్థానిక శాఖ గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయ అధికారిణి రాజేశ్వరి సమ్మర్ క్యాంపును ప్రారంభించారు. రీసోర్స్ పర్సన్ ఆదిలక్ష్మీ, శిరీష స్పోకెన్ ఇంగ్లీష్, కథలు చెప్పించడం, కథలు పుస్తకాలు చదివించడం, వారిలోని సృజనాత్మకతను పెంపొందించేలా డ్రాయింగ్, చెస్, ఆటలు మొదలైన వాటిని నిర్వహించారు.

ముదిగుబ్బ: స్థానిక గ్రంథాలయంలో జూన్ 6 వరకు ఉచిత వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి బొజ్జేనాయక్ సోమవారం తెలిపారు. విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పడం, స్పోకన్ ఇంగ్లీష్, డ్రాయింగ్‌లతో పాటు ఆటలు, పాటలపై శిక్షణ ఇస్తామన్నారు.

రేపు పాలిసెట్

కదిరి అర్బన్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు బుధవారం పాలిసెట్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు కదిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కే. రమణ సోమవారం ఓ విడుదల చేశారు. పట్టణంలో మొత్తం 5 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్ రానివారు దరఖాస్తు చేసుకున్న అప్లికేషన్‌తో పాటు రూ.400 రుసుం, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, టెస్ట్ హాల్‌టికెట్, ఆధార్‌కార్డు తీసుకుని దగ్గరలోని పాలిసెట్ పరీక్షా కేంద్రంలో సంప్రదించాలని కోరారు. వివరాలకు 901022175 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సమస్యలు తీర్చాలని ఆర్టీసీ ఉద్యోగుల దీక్ష


ధర్మవరంలో రిలే దీక్షలు చేస్తున్న ఎన్‌ఎంయూఏ నేతలు

ధర్మవరం అర్బన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు తీర్చాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఎన్ఎంయూఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీ రమణ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో సోమవారం ఎన్ఎంయూఏ డిపో కార్యదర్శి మధుసూదన్ ఆధ్వర్యంలో జోనల్ వైస్ ప్రెసిడెంట్ బీఎన్ శేఖర్, డిపో కార్యదర్శి మధుసూదన్, గ్యారేజ్ కార్యదర్శి హరికృష్ణ, శ్రీనివాసులు, మంజునాథ్, గోపాల్, అహమ్మద్ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. అక్రమ సస్పెన్షన్లు, తొలగింపులను ఆపాలని, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. డిపో ట్రెజరర్ వైవీఎస్ రెడ్డి, గ్యారేజ్ అధ్యక్షుడు డీఆర్ కుమార్, సీనియర్ నాయకులు మాధవ, ఎంసీజీ రావు, ఎం.గోపాల్ పాల్గొన్నారు.

కదిరి అర్బన్: తమకు ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను అమలు చేయాలని సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీ ముందు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు రిలే దీక్షలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ చిన్న చిన్న తప్పులకు కూడా ఉగ్యోగాల నుంచి తొలగిస్తున్నారన్నారు. నూతన బస్సులను కొనుగోలు చేయాలన్నారు. ఎన్ఎంయూఏ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, బైరిశెట్టి, వహీదాబేగం, మాధవీదేవీ, నాగరాజు, మనోహర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు సోమవారం డిపో ఎదుట నిలే దీక్షలు చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ భద్రతపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సర్క్యులర్ అమలు చేయాలన్నారు. అన్ని కేటగిరీల్లో పదోన్నతులు కల్పించి ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. అసోసియేషన్ రీజనల్ ఉపాధ్యక్షులు కేశప్ప, బాబ్జాన్, రవితేజ, రీజనల్ ట్రెజరర్ చంద్రాయుడు, కమిటీ సలహాదారు అప్పిరెడ్డి, కోఆర్డినేటర్లు శివశంకర్, నాగరత్నమ్మ, భవాని, మనోహర్, ఎల్ఎస్‌నాయక్, టీసీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల సమాచార కేంద్రం ఏర్పాటు చేయాలి

ప్రశాంతి నిలయం: శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో వినియోగదారుల సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర వినియోగదారుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి జి.సురేష్‌కుమార్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ టీఎస్ చేతన్‌ను కలసిన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సమాచార కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా వినియోగదారులు నష్టపోకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. కొత్తగా ఏర్పాటైన జిల్లా కేంద్రాల్లో సమాచార కేంద్రాలను ఏర్పాటు చేయాలని వినియోగదారుల కమిషన్ ఆదేశాలు ఉన్నాయని ఆయన తెలియజేశారు.

సంక్షిప్త సమాచారం

పారిశుద్ధ్య కార్మికుల పిల్లలకు ఉద్యోగాలివ్వాలి

కదిరి టౌన్: మున్సిపాలిటీ పారిశుద్ధ్య విభాగంలో తొలగించిన కార్మికుల స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగం ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణ, తిరుపాల్, జనార్ధన్, ఉదయ్, రామ్మోహన్, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ముదిగుబ్బ: ఇళ్లులేని పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ నారాయణస్వామికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ నిరుపేదలకు మూడు సెంట్ల స్థలంతో ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్నారు. సీపీఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, అవాజ్ కమిటీ మండల కార్యదర్శి బాబ్‌జాన్, పక్రుద్దీన్, అల్లాభక్ష, ముత్తు, పక్కీరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎన్పీకుంట: ప్రభుత్వం గ్యాస్, విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఐ నాయకులు సోమవారం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు. అలాగే నిరుపేదలకు నివేశన స్థలాలు మంజూరు చేయాలని సీపీఎం నాయకులు రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జి.రమణ, రైతు సంఘం నాయకులు సూర్యనారాయణరెడ్డి, సీపీఎం నాయకులు నాగరాజు, ఆర్ఐ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన మొక్కజొన్న


దాదులూరు కొట్టాల దగ్గర గాలివానకు నేలకొరిగిన మొక్కజొన్న పంట

కనగానపల్లి: వాతావరణ మార్పులతో ఆదివారం రాత్రి కురిసిన గాలీవానకు పలుచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. దాదులూరు కొట్టాల గ్రామంలో మూడు ఎకరాల్లో మొక్కజొన్న కిందకు వాలిపోయింది. కంకి దశలోఉన్న పంట నేలకొరగడంతో దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని, దీనివల్ల రూ.లక్షకుపైగా పంట నష్టం వాటిల్లినట్లు రైతు హరికుమార్ తెలిపారు. ఇక ముక్తాపురం, మామిళ్లపల్లి, కుర్లపల్లి గ్రామాల పరిధిలోని సుమారు 15 ఎకరాల్లో మామిడి కాయలు రాలిపోయాయి. అధికారులు పంటలను పరిశీలించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

1 నుంచి ఉచిత బాస్కెట్ బాల్ శిక్షణ

ధర్మవరం అర్బన్: జిల్లా క్రీడా సాధికారక సంస్థ, ఆత్మీయ ట్రస్ట్ సౌజన్యంతో మే 1 నుంచి నెల రోజులపాటు ఉచితంగా బాస్కెట్ బాల్ వేసవి శిక్షణా శిబిరం నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అసోసియేట్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలోని క్రీడా మైదానంలోనున్న బాస్కెట్ బాల్ కోర్టులో సోమవారం ఆయన మాట్లాడుతూ రోజూ ఉదయం, సాయంత్రం కోచింగ్ ఇస్తామన్నారు. వివరాలకు 9030944717, 9391710032 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా, కోచ్ సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో సోలార్ ఏర్పాటు తగదు

తనకల్లు: మల్లిరెడ్డిపల్లి వద్ద ఉన్న ప్రభుత్వ భూముల్లో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయరాదని గ్రామస్తులు, సీపీఐ, సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శోభా సువర్ణమ్మకు వినితిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లిరెడ్డిపల్లి పంచాయతీలోని నెంబర్లు 61, 63లోని దాదాపు 150 ఎకరాలను ప్రైవేట్ సోలార్ కంపెనీలకు అప్పగించడానికి రెవెన్యూ అధికారులు ప్రతిపాదనలు పంపడం దారుణమన్నారు. ప్రభుత్వ భూముల్లో సోలార్‌ను ఏర్పాటు చేస్తే పశువులకు మేత, నీరు కూడా దొరికే పరిస్థితి ఉండదన్నారు. నాయకులు తోపు పారేసు, రెడ్డెప్ప, శివన్న, రమణ, చలపతి, రామాంజులు, గరుడప్ప, శ్రీనాథ్‌రెడ్డి, చంద్రమోహన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: కరువు ప్రాంతంగా ప్రకటించిన నేపథ్యంలో రైతులకు ప్రభుత్వ సాయం అందించాలని సీపీఎం,సీపీఐ నాయకులు తహసీల్దార్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. రబీలో పంటలు నష్టపోయిన రైతులకు పంటనష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సీపీఐ మండల కార్యదర్శి శ్రీరాములునాయుడు, సీపీఎం రైతు సంఘం నాయకులు కెకె రాజారెడ్డి తదితరలు పాల్గొన్నారు.

ఘనంగా అమావాస్య పూజలు


పూజలందుకున్న కాలభైరవస్వామి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచక్రవర్తి థియేటర్ ఎదురుగా ఉన్న కాలభైరవస్వామి ఆలయంలో సోమవారం అమావాస్య పూజలు ఘనంగా జరిగాయి. పూజారి ధనుంజయ స్వామికి అభిషేకాలు, ప్రదోషకాలం, అమావాస్య గడియల్లో కూష్మాండ దీపోత్సవాన్ని చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. స్వామి ఎదుట పూజించిన బూడిద గుమ్మడికాయలు ఇంటికి, కొబ్బరికాయలు ఇంటి లోపల కడితే నరదిష్టి, ఇతర దిష్టి దోషాలు తొలగి మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం. అనంతరం భక్తులకు కంకణధారణ కార్యక్రమం నిర్వహించారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ధర్మవరం: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నామని కమిషనర్ ప్రమోద్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30గంటలకు కౌన్సిల్ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

డ్రిప్ పైపుల చోరీ

ఓడీచెరువు: మిట్టాపల్లి పంచాయతీలోని మల్లాపల్లిలో ఓ రైతు పొలంలోని డ్రిప్ పైపులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. వివరాలు.. మల్లాపల్లికి చెందిన రైతు బూదిలి సాంబశివారెడ్డి తన పొలంలో డ్రిప్ పైపులు ఏర్పాటు చేశాడు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రూ.3 లక్షల విలువ చేసే పైపులు ఎత్తుకెళ్లారు. దీనిపై బాధిత రైతు సోమవారం ఎస్ఐ మల్లికార్జునరెడ్డికి ఫిర్యాదు చేశాడు.

3న చైతన్యయాత్ర

గాండ్లపెంట: సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరుతూ మే 3న చైతన్యయాత్ర నిర్వహిస్తున్నట్లు సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు శ్రీనివాసులు, చంద్రశేఖర్, రాజశేఖర్, ఆనందరెడ్డి సోమవారం తెలిపారు. పుట్టపర్తిలో జరిగే యాత్రకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు తరలిరావాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కదిరి టౌన్: దామవాండ్ల పల్లిలో నూతనంగా నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బత్తల హరిప్రసాద్ రూ.1,65,000 విరాళం అందజేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు హరిప్రసాద్‌ను సన్మానించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


తనకల్లులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ జయంతి



కనగానపల్లిలో పౌష్టికాహార ప్రాధాన్యత తెలియజేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి

తనకల్లు: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ జయంతి, తహసీల్దార్ శోభా సువర్ణమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలను అడ్డుకోడానికి గ్రామ, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఎంపీడీఓ రెడ్డెప్ప, నల్లచెరువు ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా, ఎంఈఓ కళ్యాణి, ఈఓఆర్డీ రాజశేఖర్, సూపర్‌వైజర్లు లక్ష్మీదేవమ్మ, జయమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడిమర్రి: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలితమ్మ పేర్కొన్నారు. నార్శింపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఆమె పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించే కోడిగుడ్లు, బాలామృతం, బియ్యం, నూనె తదితర వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభావతి, అరుణమ్మ, భారతి, జయలక్ష్మీ, అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: చిన్నారుల్లో పోషకాహార లోపం లేకుండా చూడాలని ఏసీడీపీఓ సునంద అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. సోమవారం పోట్లమర్రి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని సూపర్‌వైజర్ దేవమణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీడీపీఓ సునంద పౌష్టికాహార ప్రాధాన్యతను వివరించారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించారు.

ముదిగుబ్బ: గుంజేపల్లిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ చంద్రమ్మ పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంతకు ముందు గ్రామంలో అవగాహనా ర్యాలీని నిర్వహించారు.

ఎన్పీకుంట: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ రాధిక సూచించారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం, సూపర్‌వైజర్లు నరసమ్మ, మౌలాబీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కనగానపల్లి: గర్భిణులు, బాలింతలు సరైన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి తెలిపారు. సోమవారం కనగానపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలతో సమావేశం ఏర్పాటు చేసి పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మహిళలు పాల్గొన్నారు.